


# ప్రేమసాక్షి

**గుండె తడిలో మొగ్గతొడిగిన అక్షరాలను హత్తుకోవడంతో కాగితానికి ప్రాణం వస్తుంది. ఆనందానికీ, ఆవేదనకూ అల్లాడిపోవడం నేర్పిన ఆ ప్రాణస్పర్శతో అది చెలిమి చెంత చేరడానికి తపిస్తుంది**

ఒక్కసారిగా గాలి వీచింది. అప్పటిదాకా రెపరెపలాడిన నా మనసు 'హమ్మయ్య' అనుకుంది. ఆ గాలి విసురుకు నేను చెత్త సంచీ నుంచి ఎగిరి వెళ్ళి ఓ చెట్టు కొమ్మకు తగులుకున్నాను. ఇలా ఎంతసేపు ఉంటానో, ఎక్కడకెళతానో, ఏమవుతానో నాకే తెలీదు. నాకు నా ప్రాణం గురించి కాదు దిగులు. చందూకు ప్రేమ సాక్ష్యంగా నేను సార్థకం చెందకుండానే కొట్టుకుపోతున్నందుకు నా ప్రాణం కొట్టుకులాడుతోంది. ప్చ్!

ఆ రోజు చందూ ఆ స్టేషనరీ షాపుకు వచ్చి ఆ లెటర్ ప్యాడ్ కొనకపోయుంటే నేను ఒక 'కోరా కాగజ్'గానే ఉండిపోయేదాన్ని. కానీ, అలా కాలేదుగా. చందూ ఆ లెటర్ ప్యాడ్ కొనుక్కెళ్ళి శర్వాణికి ఆ లేఖే రాయకపోయుంటే నాకు వేరే విలువేం ఉండేది కాదు. అతను ప్యాడ్‌లో ఎన్నో కాగితాలు రాసింది నచ్చక చించేసి, చివరకు తన పైన రాసిన దాంతోనే సంతృప్తి చెందాడు. అతనెంతో చక్కని భాషతో, ఎంతో మార్దవంగా, మరెంతో మక్కువగా, మన్ననగా లేఖ రాయడం నిజంగా నన్ను పులకరింపజేసింది. ఇంతకూ చందూ ఏం రాశాడంటే...

శరత్ రాణీ,

నవ్వకు. నిన్ను 'శర్వాణీ' అనడం కంటే ఇలా అంటేనే బాగుంటుందనిపించింది నాకు. నిన్నెలా సంబోధించాలా అని ఎంతసేపు ఆలోచించినా ఏ పదమూ నాకు నచ్చలేదు మరి. నీకు నేనెవరో తెలీదు. కానీ, నాకు మాత్రం ఏడాది పైగా నువ్వు తెలుసు. నువ్వు వెళ్ళే షాపింగ్ సెంటర్లు, థియేటర్లు అన్నీ నాకు పరిచితాలే. అల్లంత దూరాన ఒక ప్రేక్షకుడిగా నిన్ను ఆరాధిస్తూ కాలం గడిపాను. కానీ, మొన్న చూసిన సినిమాలో ముక్కోణపు ప్రేమ కథ నన్ను కలవరపరచింది. ముందుగా నీకు నేను ప్రేమ దరఖాస్తు చేసుకోకపోతే అపశ్రుతి పలికే ప్రమాదం ఉందని తొలిసారిగా భయం వేసింది.

నిన్ను చూసేవరకు ప్రేమించడాల గురించి నాకు అసలు అభిప్రాయమే లేదు. అదంతా ట్రాష్ అనుకునేవాణ్ణి. అందులోనూ సంపన్న కుటుంబానికి చెందిన అమ్మాయిలంటే నాకసలు ఇష్టం ఉండేది కాదు. వాళ్ళంతా మానవత్వమన్నది మచ్చుకు కూడా ఉండని గర్విష్ఠులని అంచనా వేసేవాణ్ణి. కానీ, నిన్ను చూసిన క్షణంలో నాకా విషయాలేవీ గుర్తుకు రాలేదు. తొలిసారిగా హృదయాంతరాళం స్పందించిన అనుభూతి. 'అదేం లేదు' అని నన్ను నేను అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నించి కూడా ఓడిపోయా. ప్రేమంటే అదేనని నాకర్థమయింది. కానీ, నాది వన్ వే ట్రాఫిక్. నీకు నన్ను పరిచయం చేసుకోవడం గురించి కూడా ఆలోచించా. ఏ ప్లానూ నచ్చలేదు. నాటకీయంగా 'కర్చీఫ్ పడిపోయిం'దంటూ అందించడం వంటివి నాకు నచ్చవు మరి. అందుకే ప్రేమ దరఖాస్తే ఉత్తమం అనుకొని అంకురార్పణ చేస్తున్నాను. నేను సామాన్యుణ్ణి. ఒకానొక జాతీయ బ్యాంకులో జూనియర్ ఆఫీసర్‌ను. కూడికలు, తీసివేతల ప్రపంచంలో ఉండేవాడికి ప్రేమ గురించిన సమ్‌ను సాల్వ్ చేయడం కష్టమే కదా మరి. మనం కలుసుకుని పరస్పరం మాట్లాడుకోవడానికి అభ్యంతరం లేకపోతే హోటల్ 'నందన'లో ఆదివారం ఉదయం పదకొండు గంటలకు కలుసుకుందాం. నేనక్కడ ఎదురు తెన్నులు చూస్తూ ఉంటా. ఇంకా ఎన్నో చెప్పాలని ఉంది. కానీ, ఎక్కువ రాస్తే నిన్ను విసిగించినట్లవుతుందేమోనని కాసింత భయం. సెలవ్!

(అనుగ్రహిస్తే) నీ,
చందూ.

చందూ నన్ను ప్యాడ్ నుంచి వేరు చేసి ఒక పుస్తకంలో భద్రంగా పెట్టాడు. నేను మాత్రం నా మనో చక్షువులతో చందూను, అతని మనసునూ అనుసరిస్తున్నా... గమనిస్తున్నా!

ఆ మర్నాడు ఏం జరిగిందంటే...

సాయంత్రం చందూ ఆఫీసు నుంచి వచ్చేసరికి ఇంటివారి పాప వచ్చి "అంకుల్! మీకు లెటరొచ్చింది" అంటూ కవరందించింది. చందూ ఆత్రంగా కవరందుకుని, తెరిచాడు.

చిరంజీవి చందూకి!

ఇక్కడ అందరం క్షేమం. నువ్వక్కడ క్షేమంగా ఉన్నావని తలుస్తాను. మీ అమ్మ నీ గురించి బెంగ పెట్టుకుంటోంది. 'ఎన్నాళ్ళు వాడలా హోటల్ కూడు తినడం? పెళ్ళి చేసేద్దాం. ఏ ఈడు కాముచ్చట' అంటూ రోజూ నా చెవిలో ఇల్లు కట్టుకు పోరుతోంది. చెల్లి ఇంకా చదువుకోవాలి కాబట్టి దాని కిప్పుడే పెళ్ళి తొందరలేదు. 'హాయిగా ఉన్నావు కదా, నీకిప్పటినుంచే ఎందుకు బాధ్యతల జంజాటం' అనుకుని నేను ఉపేక్షిస్తూ వచ్చాను. ఇలా ఉండగా మొన్న మామయ్య ఒక సంబంధం తీసుకువచ్చాడు. వాళ్ళు బాగా ఉన్నవాళ్ళే. ఒక్కతే పిల్లట. బుద్ధిమంతుడైన కుర్రాడి కోసం వెదుకుతున్నారట. రేపు ఆదివారం పిల్లను చూసుకోవడానికి రమ్మని కబురు చేశారు. కాబట్టి నేను, అమ్మ వస్తున్నాం. నువు కూడా రెడీగా ఉండు. చూసి వద్దాం. మామయ్య కూడా వస్తానన్నాడు. అమ్మ, చెల్లి నిన్ను అడిగినట్లు చెప్పమన్నారు. ఇంతే సంగతులు.

చందూ డీలా పడిపోయాడు.

'అరె ఇప్పుడెలా? ఎన్నాళ్ళుగానో మనసులోనే

శర్వాణిని ఆరాధిస్తూ, చివరకు తన మనసంతా కాగితం మీద పెట్టి ఆమెకెలాగైనా అందించాలనుకునే వేళకు ఈ ఉత్తరం.

నాన్నకెలా చెప్పడం. తానెప్పుడూ శర్వాణిని దూరంగా ఉండి చూడడమే. ఆమె పేరైనా ఆ పెద్దాయన ఒక రోజు గట్టిగా పిలవబట్టే తెలిసింది. ఇంతకుమించి మరేం తెలీదు. ఏమీ తెలియకుండానే నేనో అమ్మాయిని ఆరాధిస్తున్నాను. ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకుంటానని చెబితే పిచ్చివాడి కింద జమకట్టరూ!

ఏ వంకన ఈ పెళ్ళి చూపులను తప్పించుకోవడం? తనకిష్టం లేకపోయినా చూపులకంటూ వెళ్ళిన తర్వాత తిరస్కరించడం మర్యాద కాదని తెలును. కానీ, గత్యంతరం లేదే. పోన్లే చూసినంత మాత్రాన నచ్చాలని ఏంవుంది? అమ్మాయికి కళ్ళు చిన్నవనో, నోరు పెద్దదనో, పొడుగు ఎక్కువనో, తక్కువనో ఏదో ఒకటి చెబితే సరి. తప్పనిసరి పరిస్థితులలో ఇలాటి సాకు పెట్టకుండా మానవమాత్రులకు ఎలా గడుస్తుంది? సో అమ్మా, నాన్నలతో బుద్ధిగా వెళ్ళి ఆ పని కానిస్తే పోలా' అనుకొని ఊపిరి పీల్చుకున్నాడు.

'అవునూ. నాన్న పుస్తకాలన్నీ నవరిస్తే శర్వాణికి తాను రాసిన లేఖ కనిపిస్తే... బాబోయ్!' అనుకుంటూ పుస్తకంలో భద్రంగా ఉన్న నన్ను తీసి, పుస్తకాల పెట్టెలో ఓ లావుపాటి పుస్తకంలో దాచాడు. ఆ పైన పెట్టె మూశాడు. పుస్తకంలో ఇరుక్కున్న నేను 'ప్చ్! ఇక నేనెప్పుడు వెలుగు చూస్తానో' అని ఘోషించాను. కానీ, నా ఘోష ఈ చందూకి వినిపించేనా? నా మనసు మాత్రం పెట్టె బయటే చిక్కుబడిపోయి చందూని గమనిస్తూనే ఉంది.

శనివారం రాత్రే చందు అమ్మా, నాన్న వచ్చారు. "చందూ! నీ పెళ్ళి చేసేస్తే మా బాధ్యత తీరిపోతుంది. సంపాదిస్తున్నావు కదాని డబ్బు కోసం కక్కుర్తిపడి మేం నీకు పెళ్ళి చేయడం లేదని మొన్న ఆ రాజేశ్వరి ఎవరితోనో అన్నదట. మా కెందుకు ఆ నింద. మంచి సంబంధం వస్తే చేయాలనే ఉంది. మామయ్య తెచ్చిన సంబంధం ఇది. పిల్ల కూడా బాగానే ఉంటుందన్నారు. చూద్దాం. ఎవరికెక్కడ ఘటన ఉన్నదో." తల్లి ఎప్పటి మాదిరే గంభీరంగా మాట్లాడింది. మర్నాడు మామయ్య కూడా వచ్చాడు. అంతా కలిసి పెళ్ళి చూపులకు బయల్దేరారు. నా మనసూ చందూ వెంటే...

తండ్రి చెప్పిన అడ్రస్ ప్రకారం టాక్సీ ఒక భవంతి ముందు ఆగింది. ఆవరణలో కనిపించిన కారును చూసి ఉలిక్కిపడ్డాడు. అరె! ఇది శర్వాణి విహరించే కారు కదూ. అవును. అదే నంబర్. ఒకవేళ... ఆలోచన మెరిసింది. ఇంకేముంది. మనసు గాలిలో తేలిపోతుంటే ఎలా నడిచాడో లోపలికి, చందూకే తెలీదు. ఏవో పలకరింపులు, మర్యాదలు. అమ్మాయి వచ్చి కుర్చీలో కూర్చుంది. గబగబా కొట్టుకునే గుండెను అదుపులోకి తెచ్చుకుంటూ చందూ కళ్ళెత్తి చూశాడు. అవును. శర్వాణే. అదృష్టం తననే వెదుక్కుంటూ వచ్చింది.


"ఏమయినా అడగదలుచుకుంటే అడగండి." శర్వాణి తండ్రి అన్నాడు.

'ఇంతమంది ముందు శర్వాణిని ప్రశ్నలడగడమా. అయినా, ఏమని అడగాలి. పేరేంటి, చదువేంటి, వంకాయకూర వండడం వచ్చునా, ఏ సినిమాలు చూస్తావు? ఫలానా సినిమా నచ్చిందా వంటి చెత్త ప్రశ్నలు వేస్తానా. ఛీ ఛీ' అనుకుంటూ తల అడ్డంగా ఊపాడు. మామయ్య కల్పించుకుని, "మా చందూ మొదట్నుంచీ నెమ్మదే. పెద్దవాళ్ళ మాటంటే గౌరవం. బిడియం ఎక్కువ" వంటివేవో చెప్పాడు.

ఇంటికి వచ్చాక తండ్రి కోప్పడ్డాడు. "బెల్లం

> **శరత్ రాణీ,**
> **నవ్వకు. నిన్ను 'శర్వాణీ' అనడం కంటే ఇలా అంటేనే బాగుంటుందనిపించింది నాకు. నిన్ను చూసేవరకు ప్రేమించడాల గురించి నాకు అసలు అభిప్రాయమే లేదు. అదంతా ట్రాష్ అనుకునేవాణ్ణి.**

కొట్టిన రాయిలా కూర్చోకపోతే ఆ అమ్మాయిని ఏదైనా అడగొచ్చుగా. ఈ కాలం కుర్రాళ్ళు చాకుల్లా ఎలా ఉంటారు? ఇలా నెమ్మదిగా ఉంటే నిన్ను దద్దమ్మ అనుకోరూ? మామయ్య సర్ది చెప్పబట్టి సరిపోయింది. మాకయితే సంబంధం అన్ని విధాలా బాగుంది. ఆయన కూడా ఒక్కతే కూతురయినా ఇల్లరికం లాంటి మాటలేం అనలేదు. 'విడిగానే ఉండడం మంచిది. మరీ మేం కాలు కదపలేని పరిస్థితి వస్తే తప్పితే మా గురించి ఏమీ ఆలోచించక్కర్లేదన్నారు. ఆ ముక్క నాకు బాగా నచ్చింది. మరి నీ అభిప్రాయం ఏమిటో చెప్పు" అని అడిగాడు.



చిత్రాలు: నర్సిం

"నాకూ నచ్చింది." ఎలాగో చెప్పాడు చందూ.

"నచ్చినప్పుడు మరి ఆ సోక్రటీస్ మొహమెందుకు? ఇలా అయితే వచ్చే పిల్ల చెవులు పట్టుకు ఆడించగలదు, జాగ్రత్త." మామయ్య నవ్వుతూ అని, "ఇంకేం త్వరలో ముహూర్తాలు పెట్టించమని చెబుదాం" అన్నాడు.

చందూ అవేమీ వినిపించుకోలేదు. అతని మనసంతా ఇంకా ఆ అద్భుతాన్ని అనుభవిస్తూనే ఉంది. "ఇలా ఎవరికైనా జరిగుంటుందా? తాను ఏకపక్షంగా మౌన ప్రేమను పెంచుకోవడం, నిజంగానే అది ఫలించడం... ఓహ్. లక్ అంటే తనది. పెళ్ళయ్యాక శర్వాణికి ఇవన్నీ చెప్పి..." ఏవోవో ఊహలు.

చందూ కలల్లో తేలిపోతూ ఉండగానే కాలం కరిగిపోయింది. పెళ్ళి రోజు కూడా రానే వచ్చింది. అయితే, శర్వాణి కళ్ళలో ప్రసన్నత లేదు. ఏదో చిరాకు. చందూకు అది తోచినా అదంతా తన భ్రమనుకున్నాడు. పెళ్ళయిపోయింది.

చందూ ఆమెతో తను మౌన ప్రేమ కథను వివరించేలోపే ఆమె, "మీరొక బుద్ధావతారం. బుద్ధిమంతుడంటూ డేడీ నా నోరు నొక్కేశారు. పెళ్ళి చూపులకొచ్చారు. ఒక్కటంటే ఒక్క ముక్క మాట్లాడారూ? ఏదో లోకంలో ఉన్నట్టు ఆ ఫేసొకటి. ఇలాటి జడపదార్థాన్ని కట్టుకోవడం నా కర్మ..." ఆమె విరుచుకుపడింది.

"అది కాదు..." అంటున్న చందూను "ఏది కాదు. నాకు తెలుసులెండి. మీరు తల్లిచాటు బిడ్డే. మీకు ఒక సొంత గొంతుక అన్నది లేదు. ఇంకా ఏవేవో..."

చందూ ఇంక ఆగలేక, "నేను ఏడాదిగా నిన్నెంతగా ప్రేమించానో నీకు తెలీదు" అన్నాడు.

శర్వాణి వెర్రివాణ్ణి చూసినట్టు చూసి, "ఏమిటీ, మీరు ఏడాదిగా నన్ను ప్రేమిస్తున్నారా? అదీ నాకు తెలీకుండానే. భేష్." వ్యంగ్యంగా నవ్వింది.

"నీకు ప్రేమ లేఖ కూడా రాశా. అది నీకు అందించేలోపే పెళ్ళి చూపులు... వ్యవహారం. కావాలంటే చూపిస్తా..." అంటూ లేచి పెట్టె తెరిచాడు. ఏ పుస్తకంలో పెట్టిందీ మర్చిపోయినట్టున్నాడు. ఎంత వెతికినా నన్ను మాత్రం పట్టుకోలేకపోయాడు. చందూతో పాటు నేనూ ఉస్సురన్నాను.

"చాల్లెండిహ. నవ్విపోతారెవరైనా" అంది శర్వాణి.

తన మతిమరుపుకు తననే తిట్టుకుంటూ పెట్టె మూసేశాడు చందూ. నాక్కూడా చందూ మీద కోపం వచ్చింది. ఇంకోరోజు తీరిగ్గా వెదికి ఎలాగైనా నన్ను శర్వాణికి చూపించాలనుకున్నాడు. రోజులు గడిచిపోతున్నాయ్. పనికిరాని పుస్తకాలంటూ శర్వాణి ఓ రోజు ఆ పెట్టెలోని పుస్తకాలను పనిమనిషికిచ్చేసింది. పుస్తకాలతో పనిలేని పనిమనిషి చెత్తకాగితాలవాడికి అమ్మేసింది. వాడు పుస్తకాల్లోని పేజీలను అటూ ఇటూ తిప్పి, తూచి సంచీలో వేసుకుంటున్నాడు. నేను ఉన్న పుస్తకం పేజీలు తిరగేస్తుంటే, నేను జారిపడి, చివరకు సంచీపైన చేరాను. గాలికి నేనే కాదు, నా మనసూ రెపరెపలాడసాగింది. వాడికేం తెలుసు నా ఆత్మఘోష. ఇంతలో గాలి గట్టిగా వీచడం, నేను

ఎగిరి ఈ చెట్టుకొమ్మకు చిక్కడం.

ఇంక నా ఆశ సన్నగిలుతోంది. నన్నెవరు చూస్తారు? చూసినా చందూకో, శర్వాణికో అందిస్తారా? ప్చ్!' చందూ! అయామ్ వెరీసారీ..." అంతలో దేవుడిలా పల్లీలమ్ముకునే కుర్రాడు నా దగ్గరగా వచ్చాడు.

"గులాబి రంగు పేపరు బలేగుంది" అనుకుంటూ నన్ను తీసుకున్నాడు. తన దగ్గరున్న కాగితం ముక్కల్లో చేర్చాడు. హమ్మయ్య. కొద్ది సేపు నాకు రక్షణ. ఎంతమంది జనమో. ఎన్ని జంటలో... ఇది విహారస్థలం కాబోలు.

"ఒరే బాబూ! రెండు పొట్లాలివ్వు." అరె. చందూ గొంతే. పల్లీల కుర్రాడు నన్ను పైకి తీసి పల్లీలు పోసి పొట్లం కట్టాడు. మరో కాగితంతో మరో పొట్లం. రెండూ చందూకి అందించాడు. చందూ వాడికి డబ్బులిచ్చి ముందుకు నడిచాడు. ఆ వెనుకే శర్వాణి.

నాకు చెప్పలేనంత టెన్షన్‌గా ఉంది. కనీసం ఇప్పుడైనా... ఇద్దరూ పచ్చికలో కూర్చున్నారు. చందూ పొట్లంగా ఉన్న నన్ను శర్వాణికి అందించాడు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ పల్లీలు తింటున్నారు. నా మనసంతా ఏం జరగబోతోందోనన్న ఆరాటం. మళ్ళీ నేను నిరర్థకంగా గాల్లోకేనా... ప్చ్!

పల్లీలయిపోయాయి. "ఈ కాగితం బలేగా ఉందే" అంటూ నన్ను సాపు చేసి పరీక్షగా చూసింది శర్వాణి. నాకు ఆనందం ఉప్పొంగి మళ్ళీ గాల్లోకి ఎగురుతానేమోనని భయం వేసింది. అంతలో శర్వాణి, "ఓహ్... ఇది మీ రైటింగే." ఆనందంతో చిన్నగా కేక పెట్టింది.

చందూ ఆశ్చర్యంగా, ఆత్రంగా నన్నందుకున్నాడు.

చూసి, "అవును. ఇదే కాగితం. ఇది నీకు నేను రాసిందే. చూడు, కాదు చదువు" అంటూ ఆమె పక్కగా జరిగాడు. ఇద్దరి కళ్ళూ నాపై లిఖితమైన అక్షరాలపై పరుగులు తీశాయి. శర్వాణి తలెత్తి అతనివైపు తొలిసారిగా ప్రేమనంతా నింపుకుని చూసింది. 'ఇప్పుడు నన్ను నమ్ముతావు కదూ' అన్నట్లు చూశాడు చందూ.

"ఆరోజు నేను మీ మాట వినిపించుకోకుండా ఏమేమో అన్నాను. క్షమించు చందూ" అంది శర్వాణి.

"క్షమిస్తా. నువ్వు నన్ను ప్రేమిస్తే." అల్లరిగా అన్నాడు చందూ.

"ఎంతగా ప్రేమిస్తే..." అడిగింది శర్వాణి.

"చెప్పలేనంతగా. ఇప్పుడు నాకెంత హేపీగా ఉందో తెలుసా? ఆ రోజు ఈ కాగితం కనపడక, నిన్ను నమ్మించలేక నన్ను నేనే తిట్టుకున్నా" అన్నాడు.

"కాగితం కాదు. ప్రేమలేఖ." సవరించింది శర్వాణి.

"యస్. ప్రేమలేఖ. కాదు అద్భుత లేఖ. పుస్తకాలన్నీ నువ్వు పారేశావని తెలిశాక నా లేఖ మీద ఆశలన్నీ వదులుకున్నా. ఈరోజిలా పల్లీలతో తిరిగి నా దగ్గరకే రావడం అద్భుతం కదూ" అన్నాడు చందూ.

"నిజమే. ఇదో అద్భుతమైన ప్రేమలేఖ. దీన్ని పదిలంగా దాచుకోవాలి." ఎంతో ఆత్మీయంగా నన్ను స్పృశించింది శర్వాణి.

"పద పద. ఇంటికెళ్ళి సెలబ్రేట్ చేసుకుందాం" అంటూ ఆమె కళ్ళలోకి చిలిపిగా చూశాడు చందూ. ఇద్దరూ లేచి చేతులు కలిపి అడుగులేస్తున్నారు.

ఇప్పుడు నాకెంతో తృప్తిగా ఉంది. నాది ఆఫ్టరాల్ కాగితం పుట్టుకే అయినా, ప్రేమ సాక్ష్యంగా నిలిచి చందూ, శర్వాణి మనసును పూర్తిగా గెలుచుకోగలిగేలా సాయపడగలిగాను. నేను కొరగల కాగితాన్నే! ■

# నిండైన పాత్ర చిత్రణం

## *జీవిత పార్శ్వాల నిశిత పరిశీలన నుంచి రూపు దిద్దుకొన్న కథలు*



**పరిష్కారం**
రచన: ఎం.వి. రమణారెడ్డి
ప్రతులకు: నవోదయ, విశాలాంధ్ర పబ్లిషర్స్ వారి అన్ని బ్రాంచీలలో.
పేజీలు: 122.
వెల: రూ. 30/-

ఎ.ఎ.వి. ప్రసాద్

ఉద్యమ బాటలో నిరంతర పథికుని దృక్కోణం నుంచి సామాజిక జీవనంలోని విభిన్న పార్శ్వాల ఆవిష్కరణే- ఎం.వి. రమణారెడ్డి కథల సంపుటి *పరిష్కారం.* సాహిత్య విమర్శకుడుగా, వ్యాస రచయితగా లబ్ధప్రతిష్ఠుడైన రమణారెడ్డి విరసం వ్యవస్థాపక సభ్యుడు కూడా. కథలు రాయాలనే ఉబలాటం మొదటి నుంచీ ఉన్నా, బెరుకు వల్ల, ఉద్యమ ఒత్తిళ్ళ వల్ల ఆయన ఈ రంగంలో అనుకొన్నంత కృషి సాగించలేకపోయారు. "పది కథలైనా పూర్తి చేసి పుస్తకంగా ప్రచురించాలని చాలాకాలం ప్రయత్నించాను. సప్తపర్ణి నవలలో ఏడాకుల అరటికి ఎంత ప్రయత్నించినా ఎనిమిదో ఆకు అతకనట్టు, ఎంత పరితపించినా పదో కథ తయారుకాలేదు. చివరకు తొమ్మిది కథలతోనే ఈ సంకలనం తీసుకొస్తున్నాను" అని రచయిత తన ముందుమాటలో చెప్పుకున్నారు.

ఇందులో మొదటి కథ *ఇరుకు* సందు మనుషుల్లోని అంతర్లీన అసూయలు, స్వార్థాలను సున్నితంగా చిత్రించింది. మన చుట్టూ ఉండే సమాజంలో నిత్యం తారసిల్లే వ్యక్తుల మనస్తత్త్వాలను రమణారెడ్డి ఈ కథలో రూపుదిద్దిన తీరు ఆయన సునిశిత పరిశీలనా శక్తికి నిదర్శనం. *సాధ్వి* కథలో రామాయణ సీత శ్రీరాముడిని నిలదీసిన తీరు, నేటి స్త్రీవాదం లేవనెత్తుతున్న పాయింట్ల గురించి లోతైన అవగాహన కలిగిస్తుంది. "ప్రజావాక్య పరిపాలనే ప్రభువుల కర్తవ్యమైతే మనం అరణ్యవాసం వెళ్ళవద్దని ప్రజలు కోరలేదా?.. పితృవాక్య పరిపాలనకు విఘాతం కలగకూడదనుకొంటే భరతుడు సింహాసనం మీద కొనసాగాలే కానీ రాముడెన్నటికీ రాజు కాలేడు... అనురాగమే అన్నింటికన్నా బలమైన బంధమైతే పరిత్యజించవలసింది సీతనా, రాజ్యాన్నా? సీతారాముల ప్రేమ నిత్యమైనా, సత్యమైనా అది సీత మూలంగా అవుతుంది కానీ, వదలిపెట్టిన రాముని వల్ల కాదుకదా" అంటూ సాధ్వి పాత్ర ద్వారా రమణారెడ్డి రామాయణం బోధించే విలువల బోలుతనాన్ని బట్టబయలు చేస్తారు. మన పుణ్యభూమి సనాతన ధర్మానికీ, నైతిక విలువలకూ కాణాచి అని ఆత్మస్తుతి చేసుకొంటూ ఇతర దేశాల, ముఖ్యంగా పాశ్చాత్య దేశాల సంస్కృతిని ఆడిపోసుకోవడం మన దేశంలో చాలామందికి అలవాటు. ఈ ధోరణిని ఎండగడుతూ మన బండారాన్ని బయటపెట్టిన కథ *గురువింద గింజ.*

ఈ సంకలనానికి తన టైటిల్‌ను అందించిన *పరిష్కారం* కథ ముగింపు పేలవంగా ఉందని విమర్శలు వచ్చినట్లు రచయిత స్వయంగా చెప్పుకొన్నారు. ఈ కథ ముగింపు తెలుగు సినిమా క్లైమాక్స్‌ను తలపించడమే బహుశా దానికి కారణం కావచ్చు. అలాగే *గమ్యం* కథ మీద సాటి వామపక్ష మిత్రులే విమర్శలు కురిపించారని రమణారెడ్డి చెప్పారు. అనేక కార్మిక సంఘాలకు అధ్యక్షుడుగా ఉన్న తాను ఆ సంఘాలనే విమర్శించడం విచారకరమని వారు అన్నారట. సంఘటిత రంగంలోని కార్మికులకూ, అసంఘటిత రంగంలోని పనివారికీ మధ్య తేడాలను ఈ కథ ప్రస్తావించింది. "దేశాన్ని సమసమాజం వైపు నడిపించవలసిన కార్మిక సంఘాలే తప్పుసడక నడిస్తే, కార్మిక మనస్తత్వం కోల్పోయిన ప్రివిలెజ్డ్ వర్గమొకటి ఆవిర్భవించే ప్రమాదం ఉందని హెచ్చరించడమే" *గమ్యం* కథ ధ్యేయమని రచయిత ప్రకటించారు. అయితే, తన ధ్యేయాన్ని కథారూపంలో చిత్రించే సందర్భంగా దాన్ని ఓ క్యారికేచర్ స్థాయికి దిగజార్చినట్లనిపించింది. తాను చెప్పదలచుకొన్నది చెప్పడానికి రచయిత ఎన్నుకున్న సంఘటన అలాంటి భావాన్ని కలిగిస్తుంది. దీనికి బదులు కార్మిక నాయకుల్లో స్వార్థ బుద్ధి, వారి రాజకీయ అనివార్యతలు, రాజీల చుట్టూ కథ అల్లిఉంటే బాగుండేది.

> **పుస్తకాంశం**
>
> **"ఇంగ్లీషోడికి మన ఉద్యోగుల మీద నమ్మకం లేక వాకని మీద వాకన్ని తనిఖీ పెట్టుకున్నాడు. స్వరాజ్యమొచ్చి ఇన్నేండ్లైనా ఈ పద్ధతి మారలేదా?"**

ఈ సంకలనంలోని *తులామానం* కథ మన సమాజంలో క్రమశిక్షణ లేమినీ, సంయమన, సామరస్య రాహిత్యాలనూ స్పష్టంగా చిత్రించింది. జాతీయీకరణ వల్ల అలక్ష్యం, అసమర్థత పెరిగిపోతాయనీ, ప్రైవేటీకరణ వల్ల ప్రజా సర్వీసులు అత్యంత సమర్థంగా నడుస్తాయనే వాదం, సమకాలీన పరిస్థితుల్లో బలం పుంజుకొంటున్న సంగతి తెలిసిందే. అటు సిబ్బందితో పాటు, ఇటు ప్రజల్లో కూడా క్రమశిక్షణ, అంకితభావం ఉంటేనే జాతీయీకరణ ఫలిస్తుందని ఈ కథ అంతర్లీనంగా సందేశిస్తుంది.

వరకట్న ఆచారం పోవాలని నిజంగా మనకుందా అని ప్రశ్నించే కథ *చెదలుపట్టిన రాయి.* ఇక *ఔదార్యం* కథ ప్రస్తుత వ్యవస్థలో మంచివాడు సైతం ఎలాంటి అవతారం ఎత్తవలసి వస్తుందో వివరించగా, *రెక్కమాను* కథ సమకాలీన సమాజంలో పూర్వకాలపు ఆదర్శాలకు ఎంత విలువ ఉందో తేల్చిచెప్పింది. చక్కని శిల్పంతో సరళమైన శైలితో సాగిన రమణారెడ్డి కథలు పాఠకులను అలరిస్తాయి. ■